క్లుప్తంగా

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్..

నేలకొండపల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) పేదలకు వరమని నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు తెలిపారు. మండలంలోని సదాశివాపురానికి చెందిన శ్రీదేవికి శనివారం ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కు అందించి మాట్లాడారు. రాష్ట మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో పాలేరు నియోజకవర్గంలో అనేక మందికి సాయం అందుతోందని తెలిపారు. నాయకులు వల్లాల రాధాకృష్ణ, బొల్లగాని వెంకటరామారావు, నీలం నాగేశ్వరరావు, చిక్కు సత్యనారాయణ, మేళ్లచెరువు నాగేశ్వరరావు, అశోక్, దుంపల సుధాకర్ పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు శిక్షణ

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 18వ తేదీన ఉమ్రా యాత్రకు వెళ్తున్న ఉలమాలు, హుస్సాజులకు ఆదివారం ఖమ్మం రోటరీనగర్ సమీపంలోని సిటీ సెంట్రల్ కన్వెన్షన్ హాల్లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తవ్వాఫ్ టూర్ అండ్ ట్రావెల్స్ హజ్, ఉమ్రా సర్వీసెస్ నిర్వాహకులు హఫీజ్ జవ్వాద్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

ఖమ్మం మామిళ్లగూడెం: గత ఆరు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్నామని, వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించి ఆదుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా మిషన్ భగీరథ సబ్‌స్టేషన్ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అన్నం వెంకయ్య, రాంబాబులు కోరారు. శనివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 26 వరకు సమస్య పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని మోమినాన్ 160 కేవీఏ, శుక్రవారపుపేట 315 కేవీఏ, 33/11 కేవీ రామాలయం సబ్‌స్టేషన్ ఎల్‌టీ డీటీఆర్ నుంచి నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-5 ఏఈ ప్రభాకర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మోమినాన్, తబేలా మసీద్, శుక్రవారపుపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని ఆచార్లగూడెంకు చెందిన నాగరాజు(26) శనివారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు స్థానికంగా చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. అయితే, ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

గన్నేరుకాయలు తిని మహిళ..

నేలకొండపల్లికి చెందిన అంజమ్మ(35) శనివారం గన్నేరుకాయలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో చికిత్స కోసం ఆమెను కుటుంబసభ్యులు ఖమ్మం తరలించారు. అయితే, ఆమె ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

నగరంలో సినిమాలు

తిరుమల	సరిపోదా శనివారం
వినోద	ద గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం
సాయిరాం	భలే ఉన్నాడే!
ఆదిత్య	అయ్
శ్రీనివాస	35(2024)
సీఎస్ సినీ గెలాక్సీ	కమిటీ కుర్రోళ్లు, డిమాంట్ కాలనీ 2

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	40	బచ్చలికూర	3
వంకాయ	66		20
బెండకాయ	66	పాలకూర	3
పచ్చిమిర్చి	36		20
కాకర	66	చుక్కకూర	3
బోడ కాకర	150		20
బీర	58	తోటకూర	3
దొండ	46		20
పొట్లకాయ	60	గోంగూర	5
చిక్కుడు	96		20
గోరుచిక్కుడు	50	మెంతికూర	2
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	44		50
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	56		25
క్యాప్సికం	76	-ఖమ్మం వ్యవసాయం	

కాల్వొడ్డు వద్ద నిమజ్జన ఘాట్ రోడ్డుకు మట్టి పోస్తున్న దృశ్యం



గణేశ్ ఘాట్‌లు రెడీ..!

శరవేగంగా పునరుద్ధరణ పనులు

- వరదలతో కొట్టుకుపోయిన రోడ్లు
- మూడు రోజుల్లోనే కొలిక్కి వచ్చిన వైనం
- రాత్రింబవళ్లు చేయడంతో పూర్వస్థితికి..
- పనులు పర్యవేక్షించిన మేయర్, కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరుకు ఒక్కసారిగా వచ్చిన వరదలతో ఇళ్లతో పాటు రోడ్లు దెబ్బతిన్నాయి. నగరంలోని కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిల వద్ద ప్రతీ ఏటా ఏర్పాటు చేసే వినాయక నిమజ్జన, బతుకమ్మ నిమజ్జన ఘాట్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్లు కొట్టుకుపోవడమే కాక.. పెద్దపెద్ద గోయ్యిలు ఏర్పడ్డాయి. ఈ నెల 16న నగరంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఉత్సవ సమితి నిర్ణయించగా.. ఎలాంటి ఆటంకం కలగకుండా నిమజ్జన ఘాట్‌లను అధికారులు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నారు. మరమ్మతులు చేసేందుకు కనీసం 20 రోజులు పడుతుందని అంతా భావించినా.. మేయర్ పునుకొల్లు నీరజ, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యలు నిరంతర పర్యవేక్షణతో మూడు రోజుల్లోనే కొలిక్కి వచ్చాయి. కాంట్రాక్టర్లతో పగలు, రాత్రి పనులు చేయిస్తుండడంతో పూర్వ స్థితికి చేరువలో ఉన్నట్లు అధికార యంత్రాంగం పేర్కొంది.

పూర్తిగా దెబ్బతిన్న ఘాట్‌లు..

మున్నేరుకు భారీగా వరద రావడం, మూడు రోజుల పాటు వరద పారడంతో ఘాట్ రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. వరద తగ్గాక ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పూర్తి చేసిన యంత్రాంగం వాటి పునరుద్ధరణపై దృష్టి సారించారు. తొలుత కొద్దిమేర పనులు చేస్తే సరిపోతుందని భావించినా అధికారులు.. జరిగిన నష్టాన్ని చూసి ఆందోళన చెందారు. వినాయక నిమజ్జనానికి గడువు దగ్గర పడుతుండగా.. రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయి 10 నుంచి 20 అడుగుల మేర గుంతలు పడడంతో వీటి పునరుద్ధరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. కాల్వొడ్డు వద్ద ఘాట్ రోడ్డు 115 మీటర్ల మేర దెబ్బతినగా, ప్రకాశ్‌నగర్ వద్ద 100 మీటర్ల వరకు రోడ్డు పూర్తిగా పాడైనట్లు తెలుస్తోంది. నాలుగు రోజుల్లో రోడ్లను అందుబాటులోకి వచ్చేలా వెంటనే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు.



పనులను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

యుద్ధప్రాతిపదికన పనులు..

ఈ నెల 11వ తేదీ వరకు వరద సహాయక చర్యల్లో ఉన్న అధికారులు.. అవి కొలిక్కి వచ్చిన వెంటనే నిమజ్జన ఘాట్ పునరుద్ధరణపై దృష్టి సారించారు. కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి ఈ నెల 12వ తేదీ నుంచి పనులు ప్రారంభించారు. మేయర్, కేఎంసీ కమిషనర్‌లు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం పనులను పర్యవేక్షిస్తూ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచనలు చేస్తుండడంతో మూడు రోజుల్లోనే ఘాట్ రోడ్డును పూర్వస్థితికి తీసుకొచ్చారు. ఇక పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ వాహనాల ట్రాఫిక్ జామ్ కాకుండా తీసుకోవాల్సిన చర్యలను ఘాట్ వద్ద పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

పనులు అవుతాయనుకోలేదు..

వరదలు తగ్గిన తర్వాత కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్ ప్రాంతాలకు వెళ్లి నిమజ్జన ఘాట్‌లను చూస్తే రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయి. వినాయక విగ్రహాల నిమజ్జనం సమయం దగ్గర పడడంతో.. యుద్ధప్రాతిపదికన పనులు చేయించి మూడు రోజుల్లోనే రోడ్లను పూర్వస్థితికి తీసుకొచ్చాం. నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– పునుకొల్లు నీరజ, మేయర్

కొనసాగుతున్న వరద సాయం



ఖమ్మంగాంధీచౌక్: చర్చి కాంపౌండ్‌లో నిత్యావసరాలు అందిస్తున్న సీఎస్ఐ సంస్థ ప్రతినిధులు



ఖమ్మంరూరల్: జలగంనగర్‌లో నిత్యావసరాలు అందిస్తున్న పొంగులేటి ప్రసాద్‌రెడ్డి

- ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని చర్చి కాంపౌండ్ సీఎస్ఐ సెయింట్ మేరీస్ చర్చిలో శనివారం దక్షిణ ఇండియా సంఘం దోర్నకల్ మండలం ఆధ్వర్యాన మున్నేరు వరద బాధితులు 400 మందికి నిత్యావసరాలను మత పెద్దలు అందజేశారు. అలాగే నగరంలోని బొక్కలగడ్డకు చెందిన 350 వరద బాధిత కుటుంబాలకు శ్రీ కాళీ అన్నపూర్ణేశ్వరి సేవా సమితి హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యాన స్థానిక ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో రూ.2వేల విలువైన నిత్యావసరాలను అందించారు.
- ఖమ్మం సహకారనగర్: మున్నేరు వరద బాధితులకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన వంట పాత్రలు, ప్లేట్లు, గ్లాస్‌లు, గిన్నెలు, కుక్కర్లు, గంటెలు తదితర సామగ్రి అందించారు.
- తిరుమలాయపాలెం: మండలంలోని రాకాసితండా వరద బాధితులకు తిప్పారెడ్డిగూడెం గ్రామానికి చెందిన అర్వపల్లి శ్రీనివాస్, రామయ్యలు శనివారం 60 కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు.
- ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గంలోని వరద బాధితులకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో పాటు ప్రతీ కుటుంబానికి రూ.5వేలు, రెండు దుప్పట్లు, రెండు చీరలు, లుంగీలు, టీషర్టులు, టవల్స్ ఉన్నకిట్లను అందించారు. ఈనేపథ్యాన మండలంలోని రాజీవ్‌గృహకల్పలో 249 కుటుంబాలకు, నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలో 214, సాయినగర్‌లో 222, జలగంనగర్లో 721, కేబీఆర్‌నగర్‌లో 199, టెంపుల్‌సిటీలో 308, సాయిప్రభాత్‌నగర్‌లో 111, అభయటౌన్‌షిప్‌లో 527, దానవాయిగూడెంలో 527, రామన్నపేటలో 719 కుటుంబాలకు మంత్రి పొంగులేటి సతీమణి పొంగులేటి మాధురి, సోదరుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డిలు నిత్యావసరాలు అందించారు. అలాగే మండలంలోని జలగంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న వరద బాధిత విద్యార్థులకు కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యాన హైదరాబాద్‌కు చెందిన రాక్‌వెల్ ఇంటర్నేషనల్ పాఠశాల సహకారంతో సమకూర్చిన స్టేషనరీ, దుస్తులు, నోట్ పుస్తకాలను మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, టీఎస్‌జీఓ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావులు శనివారం పంపిణీ చేశారు.
- ఖమ్మంఅర్బన్: నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లిలోని శ్రీభక్తాంజనేయస్వామి గణేష్ ఉత్సవ కమిటీ, టేకులపల్లి చిల్డ్రన్స్ ఉత్సవ కమిటీల సంయుక్త ఆధ్వర్యాన ధంసలాపురం కాలనీలోని సుమారు 1500 మంది వరద బాధితులకు శనివారం అన్నదానం చేశారు. అలాగే కేశవాపురం గ్రామానికి చెందిన ఇంటూరి సత్యనారాయణ, సరస్వతి దంపతుల సహకారంతో ఎస్‌బీకే సేవా సమితి ఆధ్వర్యాన మండలంలోని దానవాయిగూడెంలో సుమతి, నాగరాజు, మహేష్ కుటుంబాలకు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.15వేలు అందించారు.
- ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని బొక్కలగడ్డతో పాటు రాకాసితండాలో వరద బాధితులకు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన చీరలు, వంట సామగ్రి, దుప్పట్లు అందించారు. బంధంపల్లిలో 31 కుటుంబాలకు వంట సామగ్రి, దుప్పట్లు అందించారు.



ఖమ్మం సహకారనగర్: వంట సామగ్రి పంపిణీ చేస్తున్న చేతన ఫౌండేషన్ బాధ్యులు



ఖమ్మం మామిళ్లగూడెం: వంట సామగ్రి, దుప్పట్లు, చీరలు అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు



ఖమ్మంఅర్బన్: వరద బాధితులకు అన్నదానం చేస్తున్న టేకులపల్లి ఉత్సవ కమిటీ సభ్యులు



తిరుమలాయపాలెం: రాకాసితండాలో దుప్పట్లు అందిస్తున్న రామయ్య, తదితరులు

పాఠశాలల్లో హిందీ దివస్..

జాతీయ హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో హిందీ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించి అభినందించారు.

– ఖమ్మం సహకారనగర్



త్రివేణిలో హిందీ దివస్ వేడుకలు

ఆలయ భూములకు హద్దులు నిర్ణయించండి

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ రాజగోపాలస్వామి ఆలయ భూములకు హద్దులు నిర్ణయించాలని ఎస్.రాధాకృష్ణమూర్తి, పి.గోపాలకృష్ణమూర్తి కోరారు. ఈమేరకు శనివారం వారు రాష్ట దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేయడంతో పాటు దేవాదాయ శాఖ డీసీని కలిసి ఫిర్యాదు ప్రతి అందజేశారు. ఆలయానికి 15.15 ఎకరాల భూమి ఉండగా, సర్వే నంబర్ ప్రకారం తక్కువగా చూపిస్తుండడంతో కౌలుదారులు ముందుకు రావడం లేదని తెలిపారు. ఈమేరకు సర్వే చేయించి భూముల హద్దులు నిర్ణయించాలని కోరారు.

పందుల బెడద నుంచి కాపాడండి

నేలకొండపల్లి: నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని చెరువుమాధారం గ్రామంలో ముస్లింలతో పాటు పలు కుటుంబాలు నివసించే ఇళ్ల మధ్య పందుల పెంపకం చేపట్టడంతో దుర్వాసన వస్తుందని బాధితులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. ప్రతీ ఆదివారం ఆ పందులను కోసి రోడ్డుపైనే విక్రయిస్తున్నారని, ఫలితంగా దుర్వాసన భరించలేకపోతున్నామని చెబుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, వాటిని ఊరి బయటకు పంపకపోతే తామే ఊరి విడిచి వెళ్తామని బాధితులు వాపోతున్నారు. ఈమేరకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి తమకు న్యాయం చేయకుంటే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని బాధితులు హెచ్చరించారు.

మంత్రి పొంగులేటి నివాళి

రఘునాథపాలెం: నిబద్ధత కలిగిన రాజకీయ నాయకుడు కుతుంబాక బసవ నారాయణ అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వి.వెంకటాయపాలెంలో శనివారం జరిగిన బసవ నారాయణ సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, నాయకులు మిక్కిలినేని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. తొలుత టీడీపీ నాయకుడు డాక్టర్ రామనాథం, తదితరులు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.

నృసింహుడి లీలా విలాసంపై ప్రవచనాలు



ప్రవచనాలు వినిపిస్తున్న పీఠాధిపతి

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం స్వామి వారి లీలా విలాసంపై నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి ప్రవచనాలను వినిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య కార్యనిర్వాహణాధికారి కొత్తూరి జగన్మోహన్‌రావు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఊరూవాడా పూజలు.. అన్నదానాలు..



గణేశ్ నవరాత్రులను పురస్కరించుకుని శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పలు చోట్ల భక్తులకు పూజా సామగ్రి పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంఅర్బన్: శ్రీనగర్‌కాలనీలో 108 రకాల పిండివంటలతో పూజలు అందుకుంటున్న బొజ్జగణపయ్య



ఖమ్మంమయూరిసెంటర్: బుర్హాన్‌పురంలో పూజలో పాల్గొన్న తుమ్మల యుగంధర్



నేలకొండపల్లి: మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీలో పూజలో పాల్గొన్న ఎండీ నామ కృష్ణయ్య



ఖమ్మంరూరల్: పూజలు చేస్తున్న తుంబూరు దయాకర్‌రెడ్డి, తదితరులు



కామేపల్లిలో అన్నదానం చేస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు



రఘునాథపాలెం: పాటివారిగూడెంలో అన్నదానం చేస్తున్న గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు



ఖమ్మంగాంధీచౌక్: 46వ డివిజన్‌లో అన్నదాన కార్యక్రమం



ఖమ్మంఅర్బన్: ప్రశాంతినగర్‌లో పూజా సామగ్రి అందిస్తున్న కార్పొరేటర్ కోటి

పాఠశాలకు బెంచీల వితరణ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ శ్రీనివాసనగర్ బెస్తాకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన చిన్నారులు బెంచీలు లేక నేలపై కూర్చొని విద్యనభ్యసిస్తున్నారు. ఈక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ధనాల రాధ కుమారుడు ధనాల శ్రీకాంత్ విద్యార్థుల అసౌకర్యాన్ని చూసి వెంటనే సూర్యపేటలోని ఓ సంస్థకు 10 బెంచీలు ఆర్డర్ ఇచ్చారు. ఆ బెంచీలను తెప్పించాక శనివారం మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి రాధ, శ్రీకాంత్‌కు పాఠశాలకు అప్పగించారు. కాగా, ఈ పాఠశాలకు సరైన రహదారి లేకపోవడంతో వానాకాలంలో పాఠశాల ఎదుట మోకాలు లోతు నీరు నిలిచి ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ అగస్త్యకు విన్నవించగా.. సానుకూలంగా స్పందించినట్లు స్థానికులు చెబుతున్నారు.



చిన్నారులతో మేయర్ నీరజ, కార్పొరేటర్ ధనాల రాధ, శ్రీకాంత్, తదితరులు

హైకోర్టు తీర్పును అమలు చేయండి

ఖమ్మంమామిళ్లగూడెం: నీట్ తెలంగాణ – 2024 ఎంబీబీఎస్ అడ్మిషన్లలో తెలంగాణలో పుట్టి, పెరిగిన తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని పలువురు విద్యార్థులు కోరారు. శనివారం కొందరు విద్యార్థులు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. నీట్ అడ్మిషన్లకు సంబంధించి, 2024, జూలై 19 నాడు జీఓ ఎంఎస్ నంబర్ – 33 ద్వారా కొత్త నిబంధనలు తెచ్చారని, ఇవి నోటిఫికేషన్ విడుదల సమయంలో లేవన్నారు. ఇదే విషయమై హైకోర్టును ఆశ్రయిస్తే తెలంగాణలో పుట్టి పెరిగిన వారందరినీ స్థానికులుగా పరిగణించి, నీట్-2024లో అడ్మిషన్లు ఇవ్వాలని తీర్పు ఇచ్చిందని, దీనిని అమలు చేయాలని కోరారు. సమావేశంలో విద్యార్థులు అక్షర, సీహెచ్. జాహ్నవి, రిషితచౌదరి, ఉపాసన, మాధవి, నాగమణి, అన్వేశ్, హరిప్రీత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యార్థులు

ఆరు నెలలకే ఆగమాగం..!

తారు రోడ్డు పడితే రాకపోకలు సాఫీగా సాగుతాయన్న ఆనందం రోడ్డు నిర్మాణం పూర్తయిన ఆరు నెలల్లోనే నెర్రలు బారింది. రఘునాథపాలెం నుంచి జింకలతండా వరకు ఉన్న లింక్‌రోడ్డును గ్రామీణ లింక్ రోడ్ల అభివృద్ధి నిధుల ద్వారా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం నుంచి నిర్మాణం చేయించారు. అయితే నిర్మాణం పూర్తయి కనీసం ఏడాది కాకముందే ఇలా నెర్రలు బారింది. దీనిపై రాకపోకలు సాగించేవారు నిర్మాణంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఏఈ చిరంజీవిని వివరణ కోరగా.. తన హయాంలో నిర్మాణం చేయలేదని, పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

– రఘునాథపాలెం



నెర్రలు బారిన తారు రోడ్డు